# వైస్రాయ్ స్పెషల్

అంతకు మూడునాలుగు రోజుల్నుంచి జరుగుతున్నాయి. వైస్రాయిగారి బండీ కలకత్తానుంచి మదరాసుమీదుగా మైసూరు సురక్షితంగా పోయే టందుకుగాను ఏర్పాట్లు. పెట్రోమాక్సు లైట్లు, వేసేచోట్ల పెట్రో మాక్సు లైట్లు కాగడాలు వెలిగించవలసిన చోట్ల కాగడాలు వెలి గించి, నమ్మకమైన పోలీసుల్ని దారి పొడుగుతా నిలబెట్టి బహూ బందోబస్తు గావించారు. ఇన్ని గంటలకు బయలుదేరుతుంది ఈ స్టేషన్‌కు ఇన్ని గంటలకు వస్తుంది వైస్రాయి స్పెషల్ అని బి. ఎన్. ఆర్; ఎమ్. ఎస్. ఎమ్. ఆర్. లైనంతా చెప్పుకోవడమే.

నేనేమిటో దాన్ని గురించి అంత విడ్డూరంగా ఆలోచించ లేదు. ఇంతకూ వార్తా పత్రికల్లో డిపార్చర్ ప్రైవేట్ అని ఉండడంబట్టి ఎదో ఎదో త్రోవను తాను ఎవ్వరికిన్నీ ఎటువంటి ఇబ్బందీ కలగజేయకుండా రెండోకంటి వానికి కనబడకుండా వెళ్ళిపోతాడు కమోసు మనకేంపని వానితోనని అసలు ఆవూసే మఱచిపోయి యదాలాపంగా మామూలుగా రైలుకు వచ్చినట్లు వాల్తేరు ప్యాసెంజరు నెం. 10 బండీమీద రాజమండ్రి పోదామని వచ్చాను స్టేషన్కు. నా బండీ బయలుదేరే రైల్టైము 18-45. మహారాణీపేట ఆ ప్రాంతాన్ని నేను బయలుదేతేసరికే 18-15 అయింది. బండి దొరుకుతుందో దొరకదో అన్నట్టు గుండెలు కవుక్కుంటూ వచ్చి గబ గబా మామూలుగా టిక్కెట్టు కొనుక్కోవడానికి తత్తరపడ్డట్టు పడుతూ లేస్తూ వెళ్ళబోయాను స్టేషన్ ఆవరణలోకి. అక్కడ ఆ పాళంగా ఓ ఎఱ్ఱటోపీవాలా

వుండి "స్వామీ! చిత్తగించి తమరు కాస్సేపు అలా ఆప్యాసెంజర్లు అందరూ నిల్చున్న తావున నిలబడండి: వైస్రాయిగారి స్పెషల్ వస్తూవుంది" అన్నాడు. "ఎంతసేపట్లో వస్తుంది ఏమిటి?" అన్నాను. "రెండుగంటల టైము ఇంకా పడుతుంది" అన్నాడు. "అయితే ప్యాసెంజర్ ఎక్కిపోవాలే నేను?" అన్నాను. "ప్యాసెంజర్ గీసెంజర్ జాంతానై. దూరంగావెళ్ళి అక్కడ నిలుచోమని చెప్పవోయి" అన్నాడు ఘట్టిగా పోలీసు సర్కిల్ రౌను తిరుగుతూ. కాన్స్టబిల్‌చేత ఆ ముక్క అనిపించుకోకుండానే నేను చలిలో వణుక్కుంటూ తక్కిన ప్యాసెంజర్లు అందఱూ నిలబడియున్న షెడ్డు దగ్గఱకు వెళ్ళి ఆరుబయట ఆగిపోయినాను.

"అయితే ప్రయాణీకులు డబ్బు ఇవ్వలేదూ? వారిలా కష్టపడవలసిందేనా ఈ రెండుగంటలూ ఈ చలిలో!" అని ఆరుబయట ఓ మూలుగు. "అయ్యో! మెతుకులు ఊళ్లో తినకుండా ప్లాట్‌ఫాంరమ్ మీద తిని గూడూరు పోవాలని వచ్చాను. మెతుకులు తినడానిక్కూడా అలా పోకూడదట" అని ఓదీనాలాపం, "భళిరా! మూడు రోజుల్నుంచి వార్తాపత్రికల్లో పడుతూ వుందికదా వైస్రాయిగారి ప్రయాణపు ప్రోగ్రాం; దాన్ని పుచ్చుకుని నేడీ ప్యాసెంజరు రెండుగంటలు ఆలస్యంగా బయలు దేఱుతుంది అని ఎందుకు రైల్వేవారు ప్రచురించి యుండకూడదు! మనల్ని చంపడాని క్కాకపోతేను" అని ఒక నిరాశ వాక్కు; ఇలాగ్గా ఆ జనంలోంచి వెలువడుతున్నాయి.

ఏలా గడచిపోయిందో వో గంట గడచిపోయింది. అంతలో బి. ఎన్. ఆర్. ఈల వినబడింది. ప్లాటుఫారమ్‌మీద నుంచి ఒకళ్లిద్దరు సార్జంట్లు తెల్లవాళ్లు టకటక మంటూ యీవల

ఆవరణలోకి వచ్చి నేటివ్ కాన్స్టబిల్సును, సబుఇన్స్పెక్టర్లను, సర్కిల్ఇన్స్పెక్టర్లను ఒకింత మిలిటరీని, "పైలట్‌గాడీ వస్తూవుంది" అని హెచ్చరించి చుట్టూచూచేరు. దూరంగాయున్న ప్రయాణీకుల గుంపులోకూడా కలకలం బయలుదేఱుతూయుంటే "మీ రెవరున్నూ దరికిరారాదు" అన్నట్టు బెత్తాలు త్రిప్పేరు.

సరిగ్గా అదే వేళకు కొందఱు దొరలు కొందఱు దొరసానులు ఎక్కణ్ణుంచి వస్తూయున్నారో వెన్నెట్లో కనబడీ కనబడని నడకతో వచ్చి తిన్నగా స్టేషన్‌లోకి వెళ్లిపోయినారు. వైస్‌రాయిగారి స్పెషల్ తెల్లగా వచ్చి తెల్లగా వెళ్ళిపోయింది మరో ముప్పావుగంటకు.

స్టేషన్‌లోకి నిరాటంకంగా వెళ్ళిపోయిన దొరల్ని దొరసానుల్ని గురించి, అంతకంటె నిరాటంకంగా వచ్చిపోయిన వైస్‌రాయిగారి స్పెషల్‌ను గురించి, విస్తుపోయి ఆలోచిస్తూ వో ప్రయాణీకుడు "తెల్ల దొరతనమునకు ఇదంతా వో మాయ ఎడ్వర్టైజుమెంటు" అని విమర్శించేడు. "మనం" అన్నాను నేను లాయం కంపులా నా చుట్టూ ఉన్న స్థలం దుర్వాసన కొడుతూవుంటే. "మనం ఈ షెడ్డులో బానిసభావానికి ఎడ్వర్టైజుమెంటు" అన్నాడు. షెడ్‌కేసి చూచాను. దానిమీద యిలా వ్రాసివుంది : "Third class waiting shed. Stand for lorries and taxis" అని ఉన్నది.

"మనం టాక్సీలమా లారీలమా" అని అనుకుంటూ Most inconvenient journey చేశాను నాటిరాత్రి టిక్కెట్టుకు రు. 2-8-0 చెల్లించాను. 18-45 కు బయలుదేరవలసిన బండి 20-45 కు బయలుదేరింది. ఇంటికి రాత్రి 11 చేరవలసిన వాణ్ణి కాకులు కూసేవేళకి చేరుకున్నాను.